399) లలిత

ప॥ మనసు నమ్మనేర్చితే మనజుడే దేవుడౌను । తనలోనే వున్నవాడు తావుకొని దైవము ॥

చ॥ మగనిపై బత్తిచేసి మగువ యొక్కరితె । తెగి పరలోకము సాధించీనట ।
వొగి వీరవైష్ణవుడై వున్నవాడు హరి గొల్చి । అగపడి ఘనమోక్ష మందనోపడా ॥

చ॥ యేలికకై పగవారి నెదిరించి బంటొకడు । మేలైన పదవులంది మెరసీనట ।
వేళతో సుజ్ఞాని శ్రీవిష్ణుకైంకర్యాలు చేసి । కాలమందే యందరిలో ఘనుడు గానోపడా ॥

చ॥ పరమపురుషార్థపుపని చేసి యొకరుడు । అరిసి నధికపుణ్యు డయ్యీనను ।
నిరతి శ్రీవేంకటేశ నిన్ను బూజించి దాసుడు । పరము నిహము జెంది బ్రదుకగ నోపడా ॥